క్లుప్తంగా

ఈ పాఠశాల భవనం సంగతి చూడండి..



శిథిలావస్థలో పాఠశాల భవనం

పెదకూరపాడు: రామాపురం గ్రామంలోని నిరుపయోగంగా, శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పక్కనే.. ఎప్పుడు కూలుతుందో తెలియని ఈ భవనాన్ని కూల్చివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల హెచ్ఎం సాంబశివరావు మాట్లాడుతూ.. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని వారు చెప్పినట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లతో పోలీసుల ర్యాలీ



పెదకూరపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వాహనదారులు, పోలీసులు

పెదకూరపాడు: పెదకూరపాడు ఎస్ఐ బి.వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, ఆటోవాలాలు పరిమితికి మించి జనాన్ని ఎక్కించకూడదని, అతివేగంగా ప్రయాణం చేయకూడదని భద్రత సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

బాలదాసు సద్గురుదేవుల 88వ ఆరాధన

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ శెట్టిపల్లిబాలదాసు సద్గురుదేవుల 88వ ఆరాధన మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సూర్యప్రజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం లో చేపట్టిన రామనామ సంకీర్తన ముగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గురువుగారిచిత్రపటం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దళారులకు వద్దు.. ఆర్బీకేలో మద్దతు..

క్రోసూరు: మండలంలోని రైతులు తమ ధాన్యం దళారులకు విక్రయించుకోవాల్సిన అవసరం లేదని.. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మండల ఏవో వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర గ్రేడ్ –ఏ రకం క్వింటాకు రూ.2,060, సాధారణ రకానికి క్వింటా ధర రూ.2,040లకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. హమాలీల ఖర్చు, గోతాలు, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. రైతులు బహిరంగ మార్కెట్ లో ధాన్యాన్ని విక్రయించుకోవద్దని తెలిపారు. రైతులకు కావాల్సిన సలహాలకు ఆర్బీకేలలో సంప్రదించవచ్చునని వెల్లడించారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గంటా

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామానికి చెందిన గంటా గోపి పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గత 45 రోజులుగా యూత్ కాంగ్రెస్ సభ్యత్వం ఉన్న సభ్యులు ఆన్‌లైన్ ద్వారా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ ఓటింగ్‌లో తనకు 327 ఓట్లు వచ్చినట్లు గోపి తెలిపారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఓటుకార్డుకు ఆధార్ అనుసంధానం



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సురేష్

నకరికల్లు: ఓటరు గుర్తింపుకార్డుకు ఆధార్ అనుసంధానం చేయడం వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే కోసం భూయజమానుల నుంచి హక్కుల పత్రాలు సేకరించాలని సూచించారు. నీటితీరువా వసూళ్లకు సంబంధించి సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకుని రైతులతో మాట్లాడి నీటితీరువా బకాయిలను వసూలు చేయాలని అన్నారు. ప్రజల వద్ద నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి లాగిన్‌లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకే.. ప్రజల ఆశీర్వాదం

- కొండూరుకు రూ.11.10 కోట్లతో సంక్షేమం
- రూ.5.89కోట్లతో అభివృద్ధి
- 'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కొండూరులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు పట్టం కడుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని కొండూరు గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, లబ్ధిదారులకు కరపత్రాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. అభివృద్ధికి దూరంగా ఉన్న కొండూరును తాను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. స్థానిక సచివాలయం పరిధిలో మూడేళ్లలో రూ.11.10 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.5.89 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేవలం మాటలు చెప్పి ప్రజలను మభ్యపెడితే.. తమ ప్రభుత్వం అభివృద్ధిని చేతల్లో చూపిస్తోందన్నారు. జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణ నాయక్, నెల్లూరు చంద్రబాబు, పార్టీ నాయకులు రామయ్య, సర్పంచ్ రామాంజినేయులు, అంబటి నారయణ, మండలపార్టీ కన్వీనర్ చిలకా చంద్రయ్య, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండవ రోజు....

కొండూరు గ్రామంలో ఆదివారం రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు.

అవగాహనతోనే..విపత్తుల నష్ట నివారణ



విపత్తుల సమయంలో రక్షణ చర్యలు వివరిస్తున్న సిబ్బంది

అమరావతి: సహజ, మానవ తప్పిదాల వల్ల సంభవించే విపత్తులను ఎదుర్కొనే..అవగాహన ఉంటే.. వాటి వల్ల జరిగే నష్టాన్ని చాలా వరకు తగ్గించవచ్చని డీటీఎం నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని ధరణికోటలో వలంటీర్లకు, ఆశ వర్కర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విపత్తుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఈవోపీఆర్డీ ప్రసాదరావు అధ్యక్షత వహించారు. వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, తుపానులు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు ప్రాథమికంగా చేయాల్సిన పనులపై... గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లేక పోవడం వల్ల చాలామంది మరణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో వరదలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. వరద వచ్చినపుడు.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లొచ్చులే అనే నిర్లక్ష్యం ఎంతో మంది ప్రాణాలు బలిగొందని చెప్పారు. వలంటీర్లు, ఆశ వర్కర్లు అవగాహన ఏర్పరుచుకుని ప్రజలకు విపత్తుల నివారణకు ఉపయోగించే వస్తువులు, విధానాలను వివరించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విపత్తు నివారణ వస్తువులను ఉపయోగించి.. ఎలా రక్షించుకోవాలో ప్రదర్శన చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు పావని, ఏఆర్ ఎస్ఐ టి.అప్పల స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారం మాయంపై కొనసాగుతున్న విచారణ

- 49 మంది రైతుల బంగారం మాయం
- బంగారం రైతులు జాబితా విడుదల
- బ్యాంకు వద్ద బందోబస్తులో పోలీసులు

సత్తెనపల్లి: మండల పరిధిలోని రెంటపాళ్ల గ్రామంలో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బంగారం మాయం పై శనివారం కూడా విచారణ కొనసాగింది. ఏజీఎమ్‌తో పాటు జోనల్ అధికారులు బ్యాంకును సందర్శించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటికే 49 మంది రుణగ్రహీతలకు చెందిన 3149.42 గ్రాముల బంగారం సంచులు మాయం కాగా వాటి విలువ రూ.1.52 కోట్లు గా ఉంటుందని నిర్ణయించి మేనేజర్ సీహెచ్ నాగేశ్వరరావు సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే బ్యాంకు మేనేజర్ రాంబాబు నాయక్, అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, గోల్డ్ అప్రైజర్ ఇమ్మిడిశెట్టి సంపత్ కుమార్ పై అనుమానాలు ఉండడంతో మేనేజర్‌ను, అసిస్టెంట్ మేనేజర్ ను సస్పెన్షన్ చేశారు. జోనల్ కార్యాలయానికి చెందిన సీహెచ్ నాగేశ్వరరావును తాత్కాలిక మేనేజర్‌గా నియమించారు.

49 మంది జాబితా విడుదల....

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెంటపాళ్ల శాఖలో బంగారు కుదవ పెట్టి రుణాలు పొందిన రుణగ్రహీతల బంగారం మాయం అయిన వారి పేర్లతో కూడిన జాబితా విడుదలైంది. జాబితాలో చిన్నమల్లు కామేశ్వరి, మక్కపాటి రాజ్యలక్ష్మి, ముప్పవరపు రమాదేవి, కంచేటి సీతాలక్ష్మి, మక్కపాటి వెంకట నాగలక్ష్మి, మర్రిశెట్టి సామ్రాజ్యం, మక్కపాటి ప్రియలత, ఉన్నం కృష్ణ, మక్కపాటి వసంత లక్ష్మి, కొర్లకుంట వెంకటరత్నం, చిన్నమల్లు లక్ష్మి, మక్కపాటి బాలచంద్రరావు, మక్కపాటి బాలచంద్రరావు, మందడపు నరేష్, మరిశెట్టి లింగారావు, దొంగల చంద్రశేఖర బాబు, చన్నమల్లు నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ముప్పవరపు జ్యోష్న, వడ్లమూడి సౌజన్య, చెన్నమల్లు భారతి, చెన్నమల్లు భారతి, కొఠారు నరసింహారావు, కొల్లు నాగేంద్రమ్మ, ఈవూరి సీతారామిరెడ్డి, మక్కపాటి బాబీ, మక్కపాటి శివరావు, మందడి రామారావు, వల్లెపు సహదేవుడు, భవిరిశెట్టి వెంకట రమణ, మక్కపాటి సాంబయ్య, మందడి రామారావు, భాష్యం సంతోషమాత, కొత్త వెంకట ఆంజనేయులు, చన్నమల్లు సుబ్బా రావు, వంగా పావని, పసుపులేటి రాంబాబు, ముప్పాళ్ళ సాంబశివరావు, ఆచంట కృష్ణారావు, గుంజి రాములు, పొట్లపల్లి శివారెడ్డి, నల్లవల్లి నరేంద్ర, మందడి సత్యవతి, వల్లెపు పుల్లారావు, గుంజి రామకృష్ణ, నెల్లూరు అచ్చయ్య, పల్లెల రత్న కుమారి, బయ్యవరపు బుల్లబ్బాయి, శ్రీ వెంకటేశ్వర సూపర్ మార్కెట్ పేర్లు జాబితాలో ఉన్నాయి.

బ్యాంక్ ఎదుట పోలీసుల బందోబస్తు...

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెంటపాళ్ల బ్రాంచ్ లో బంగారం మాయం వ్యవహారంలో ఎలాంటి వాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సత్తెనపల్లి టౌన్, రూరల్ సీఐలు యు.శోభన్‌బాబు, రామిశెట్టి ఉమేష్ నేతృత్వంలో సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ, పోలీసులు బ్యాంక్ ఎదుట బందోబస్తు నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా బ్యాంకును మూసి వేసి జోనల్ అధికారులు బ్యాంకులో విచారణ చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్‌ని ఢీకొని యువకుడి మృతి

మరో ముగ్గురికి గాయాలు



వేళంగిణిరాజు (ఫైల్)

నాదెండ్ల: నిలిపి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో మృతి చెందిన సంఘటన గణపవరం–వేలూరు డొంక రోడ్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరంలో నివాసం ఉంటూ ఓ పొగాకు కంపెనీలో పనిచేస్తున్న నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై వేలూరు నుంచి గణపవరం వస్తున్నారు. ఈ క్రమంలో శివస్వాతి స్పిన్నింగ్ మిల్లు సమీపానికి వచ్చేసరికి కంపెనీ ప్రహరీ మరమ్మతుల క్యూరింగ్ పనుల కోసం వాటర్ ట్యాంకర్‌ను రోడ్డుపై నిలిపారు. రాత్రి 9.30 గంటల సమయంలో బంధనాధం వేళంగిణి రాజు (26) తన మిత్రుడు వసంతకుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మరో వాహనంపై వీరి మిత్రులు బత్తుల రవి, నిడమానూరు రామస్వామిలు వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి సరైన లైటింగ్ లేకపోవటంతో ఒక ద్విచక్ర వాహనం ట్యాంకర్‌ను ఢీకొనగా, మరో ద్విచక్రవాహనం సైడు కాల్వలోకి దూసుకెళ్ళింది. దీంతో ట్యాంకర్‌ను ఢీకొన్న వేళంగిణిరాజు తీవ్రగాయాలపాలు కాగా, స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం చేరుకుని క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన వేళంగిణిరాజు మృతి చెందగా, తీవ్ర గాయలపాలైన మరో యువకుడు బత్తుల రవిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, మూడు నెలల కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి మోహినిదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శనివారం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రీసర్వేలో ప్రతి రైతుకు న్యాయం జరగాలి



రీసర్వే పనులపై మాట్లాడుతున్న పార్థసారథి

శావల్యాపురం: రీసర్వే పనుల్లో ప్రతి రైతుకు న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులు రికార్డులు పారదర్శకంగా తయారు చేయాలని జిల్లా సర్వే ఇన్‌స్పెక్టరు మేకపోతుల పార్థసారథి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గ్రామ సచివాలయ సర్వే యర్లు, రెవెన్యూ అధికారులతో రీసర్వే పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ 1971 ఆర్‌వోఆర్ యాక్ట్ నిబంధనలు ప్రకారం వెబ్ ల్యాండ్‌లో నమోదు కాని భూముల కలిగిన రైతులకు సంబంధించి అగ్రిమెంటు పత్రాలు కల్గి ఉన్న వారందరు అప్పటి రిజిస్టరు విలువ ఆధారంగా తహసీల్దారు రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. 5 ఎకరాల లోపు సన్న చిన్న కారు రైతులకు ఉచితంగా నేరుగా ఆన్‌లైన్ నమోదుతో పాటు తహసీల్దారు సమక్షంలో రిజిస్టరయ్యేలా ప్రభు త్వం చర్యలు చేపట్టిందన్నారు. భాగస్వామ్యం పంపిణికి సంబంధించి భూములు కూడా సరైన ఆధారాలు రెవెన్యూ అధికారులకు అందజేయాలని తద్వారా భూహక్కు పత్రాలు పొందుతారన్నారు. గతంలో సాగు చేసుకుంటు ప్రస్తుతం అనుభవంలో ఉన్నవంటి రైతులకు ఎటువంటి ఆధారాలు లేని భూములను క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు విచారణ చేసిన అనంతరం 15 రోజుల అభ్యంతరాలు తెలపాలని, లేని పక్షంలో సంబంధిత భూముల యాజమానికి భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ సదస్సులో తహసీల్దారు షేక్ జాన్ సైదులు, మండల డిప్యూటీ సర్వే తహసీల్దారు పి.నాసరయ్య, మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ

సత్తెనపల్లి: భరతమాత అన్నప్రసాద వితరణ పథకంలో భాగంగా దాతల దాతృత్వంతో నిరుపేదలకు, వృద్ధులకు, యాచకులకు శనివారం ఆహార(భోజన) ప్యాకెట్ల పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణానికి చెందిన కొప్పురావూరి చిన కనకయ్య, వీరి బావ కీర్తిశేషులు ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు గ్రంధి నరసింహారావు పుణ్య తిథి సందర్భంగా రథసప్తమి శుభదినమున గ్రంధి నరసింహారావు కుమార్తె, అల్లుడు అయిన కొప్పురావూరి సాయి రమ, చిన కనకయ్య ఆర్థిక సహాయంతో వారి చేతుల మీదుగా భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్టా శంకరరావు, గద్దం శివ శంకరరావు, ఛందోలు వెంకట మల్లికార్జున రావు, మురారిశెట్టి కోటేశ్వరరావు, మందడపు శ్రీనివాసరావు, ఎద్దులదొడ్డి రమేష్ ఉన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

రాజుపాలెం: తారు రోడ్డు వేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈ సుధాకర్ కాంట్రాక్టర్ నరసింహారావుకు సూచించారు. మండలంలోని రెడ్డిగూడెం నుంచి మొక్కపాడు మీదుగా బృగుబండ్ల వరకు వేసిన తారు రోడ్డును శనివారం పరిశీలించారు. డీఈ సుధాకర్ సుమారు కిలో మీటర్ల రోడ్డు వేసే వరకు అక్కడే ఉండి పరిశీలించారు. తారు రోడ్డు వేసే కూలీలకు సూచనలు అందించారు. ఆయన వెంట ఏఈ సాయిరాం కిరణ్, మాజీ సర్పంచ్ పశ్యావుల కోటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

స్కూటీపై నుంచి పడి మహిళకు గాయాలు

నాదెండ్ల: స్కూటీపై వెనుక కూర్చుని వెళ్తున్న మహిళ వాహనంపై నుంచి క్రిందపడి తీవ్రగాయాలపాలై గుంటూరు జీజీహెచ్‌కు తరలించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామంలో జిల్లా పరిషత్ క్వారీలో నివాసం ఉండే సామ్రాజ్యం అలియాస్ సాంబ తన మనుమరాళ్లు ఇద్దరితో కలిసి స్కూటీపై నరసరావుపేట నుంచి గణపవరం వస్తున్నారు.

ఈ క్రమంలో కావూరు డొంక రోడ్డులో వచ్చేసరికి స్పీడ్ బ్రేకర్ రావటంతో వాహనం వేగానికి సామ్రాజ్యం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. దీంతో తీవ్రగాయాలైన ఆమెను 108 వాహనంలో చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రసుత్తం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయాలపై తినిఖీలు

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ మీద శనివారం పలు ప్రాంతాల్లో మున్సిపల్ ఉద్యోగులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మైక్రాన్స్ కన్నా తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ కవర్లపై పెనాల్టీ వేశారు. మరో మారు సదరు వ్యక్తి 120 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వాడినట్లయితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర హెచ్చరించారు. వ్యాపారుల లైసెన్స్ కూడా రద్దు చేయబడుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీకి గాయాలు

ఈపూరు : ట్రాక్టర్ ఢీకొట్టడంతో సిమెంటు కూలీకి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొచ్చర్ల సమీపంలో జరిగింది. వినుకొండలో సిమెంటు కొట్టులో కూలీగా పనిచేస్తున్న కోపెల గాలెయ్య పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో కొచ్చర్ల సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాలెయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

మట్కా కేసులో ముగ్గురి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమంగా జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.5400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శనివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు చిత్రాలయ సెంటర్‌లో దాడులు నిర్వహించి మట్కా జూదానికి పాల్పడుతున్న షేక్ మహబూబ్, సాంబశివరావు, పేరూరి వెంకటేశ్వర్లులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



భావనరుషి స్వామి, భద్రావతి మాత కల్యాణ మహోత్సవం



సూర్య నమస్కారాలు చేస్తున్న వేదవిద్యార్థులు

సత్తెనపల్లి: రథసప్తమి సందర్భంగా పట్టణంలోని కొత్తపేట భావనారుషి నగర్ లోని భావన ఋషి గుడి దగ్గర భావనరుషి స్వామి భద్రావతి మాతకు కల్యాణ మహోత్సవం శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. సాయంత్రం 4 గంటలకు కనక తప్పెట్లతో, వివిధ వేషధారణలతో పెద్దపులులు, కత్తి వేషాలు ప్రదర్శిస్తూ స్వామి వారు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వ హించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు, బహుత్వ సంఘం పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆరోగ్యకారకుడు.. సూర్య భగవానుడు

అమరావతి: మండల పరిధిలోని చావపాడు శివాలయంలో రథ సప్తమి సందర్భంగా శనివారం సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీ గీతా వేంకటేశ్వర కృష్ణ యజుస్మార్త ఆగమ పాఠశాలలో.. మాఘ శుద్ధ సప్తమి ధనిష్ఠ నక్షత్ర కాలంలో విద్యార్థులు సామూహిక సౌరజపం నిర్వహించారు. అనంతరం ఏకాంబరేశ్వరునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన.. సూర్యనారాయణ స్వామికి త్రిచ, అరుణ, సౌర మంత్రాలతో సూర్య నమస్కారాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఘంటసాల చంద్రమౌళి శర్మ మాట్లాడారు. రథ సప్తమి సందర్భంగా ఆరోగ్య కారకుడైన సూర్యభగవానుని అనుగ్రహం పొందేందుకు.. సౌర హోమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, సూర్య భగవానునికి పూజలు నిర్వహించారు.

అమరేశ్వరాలయంలో..

ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని సూర్యదేవాలయంలో రథ సప్తమి సందర్భంగా సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తమి ధనిష్ఠ నక్షత్రంలో అర్చకులు పంచామృతాలతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజ చేశారు. అమరేశ్వరాలయంలో సూర్యభగవానుడిని భక్తులు పూజిస్తే మంచి జరుగుతుందని కౌశిక చంద్రశేఖరశర్మ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు అవధూత అయోధ్యస్వామి ఆశ్రమం నందు రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి హోమం, సాయి సప్తాహం, సూర్యప్రభ వాహనం, చక్రస్నానం పూజలు నిర్వహించారు. అయోధ్యస్వామి సాయినాథుడు, దత్తేశ్వరస్వామి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి ఊయల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ నిర్వాహకులు రామకృష్ణ, కోటేశ్వరమ్మ, స్వతంత్ర భారతి, శ్రీనివాసరెడ్డి, వెంకయ్య స్వామి, శివరామిరెడ్డి, సాయి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



అమరేశ్వరాలయంలో విశేషాలంకరణలో సూర్య భగవానుడు



కల్యాణం తిలకిస్తున్న మహిళా భక్తులు

ఏకాగ్రతతో పని చేస్తే విజయం సొంతం



మాట్లాడుతున్న అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు

సత్తెనపల్లి: ఏకాగ్రతతో ఏ పని చేసిన యువత విజయం సాధించవచ్చని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు అన్నారు. పట్టణంలోని వేద ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం వారి సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో యూత్ లీడర్ షిప్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ యువతకు శనివారం రెండవ రోజు జరిగిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీపీ నరసింహారావు మాట్లాడుతూ యువత దేశ భక్తిని పెంపొందించుకోవాలని, ఆ సమయంలో నేర్చుకున్నది భవిష్యత్తు లోనూ వారికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. యువతకు స్వామి వివేకానంద ఆదర్శనీయుడన్నారు. ఈ సందర్భంగా యోగాపై లక్ష్మి యువతకు శిక్షణ ఇచ్చారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ చింతాడ సూర్య ప్రకాష్, న్యాయవాది పిట్టల సురేష్ బాబు, యోగా ప్రొఫెసర్ కొటికలపూడి లక్ష్మి, జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, కార్యదర్శి అన్నవరపు స్టాలిన్ బాబు, విజయశాంతి రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి

ట్రాఫిక్ రూల్స్‌పై పట్టణంలో పోలీసులు, విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

నరసరావుపేట టౌన్: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్‌పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్కూలు ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రత్నస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ సొంత వాహనం వుండటంతో ట్రాఫిక్ సమస్య పెరగిందన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన లేకపోవడం వలన అనేక మంది యాక్సిడెంట్స్ గురవుతున్నారన్నారు. దీనివలన ఇతరులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాష్, రాంగ్ డ్రైవింగ్, ఓవర్ టేకింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం ఇలా అనేక రకాలుగా వ్యక్తిగతంగా సమాజానికి ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.తిరుపతిరెడ్డి ఏజీఎం అంజయ్య, ఆర్ఐ సురేంద్ర, ట్రాఫిక్ ఏఎస్ఐలు ఆదినారాయణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

శావల్యాపురం: జాతీయ స్కూల్ గేమ్స్ విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం హైస్కూలు విద్యార్థినులు (బాలికలు) అర్హత సాధించటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ముండ్లమూరి అనిల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపికైన విద్యార్థులతో అభినందన సభ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అర్హత సాధించిన బాలికలు యం.లిఖిత, ఆకుమల్ల సమీరా, వేముల దివ్యలకు రూ. 12 వేలు విలువ చేయు గ్రాఫైట్ బాట్స్‌ను ప్రోత్సాహకంగా అందజేస్తామని అనిల్‌కుమార్ సమావేశంలో వెల్లడించారు. ఈనెల 25 నుంచి 27 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన స్కూల్ గేమ్స్ బాలికల అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ గేమ్ పోటీల్లో జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం సాధించగా ఆ జట్టులో శావల్యాపురం హైస్కూలు బాలికలు ఎ.సమీరా, కావ్య, స్రవంతి, ఉన్నట్లు పాఠశాల పీడీ ఆర్.రాధాకృష్ణమూర్తి వివరించారు. ఈవిద్య సంవత్సరంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో 20 మంది విద్యార్థులు పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, జవంగుల బాబు, గుర్రం గోవిందరాజులు, పాపసాని సురేష్, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, ఆదాం ఖాన్ పాల్గొన్నారు.